విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి కాకినాడ, కోనసీమ తూర్పుగోదావరి

శనివారం 05 అక్టోబరు 2024 8 పేజీలు

కిక్కిరిసిన రైల్వేస్టేషన్

- పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు
- ప్రయాణికులతో కిటకిటలాడిన సామర్లకోట రైల్వే స్టేషన్

విశాలాంధ్ర - సామర్లకోట : దసరా మహోత్సవాలు పురస్కరించుకొని పాఠశాలలకు, కళాశాలలకు సుమారు పది రోజులు పైబడి విద్యాశాఖ అధికారులు సెలవులు ప్రకటించారు. దీంతో పలువురు తమ సొంత ఊర్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుని బస్టాండ్‌కి, రైల్వే స్టేషన్‌కి చేరుకోవడంతో రద్దీ వాతావరణం ఏర్పడింది. కాకినాడ జిల్లాలో ముఖ్య రైల్వే స్టేషన్‌లలో ఒకటైన ▶మిగతా 2లో..

నూతన మోటారు చట్టాన్ని రద్దుచేయాలి

ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన 2023 నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని, ఆన్లైన్ ఆటో డ్రైవర్లు, వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబల్ల సూర్యారావు భవన్‌లో యూనియన్ సమావేశం కె. రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ జాతీయ రహదారులపై పెట్టిన టోల్ గేట్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

భారీగా పెంచిన ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్ లను తగ్గించాలని ప్రమాదకరంగా ఉన్న రోడ్లను వేసి వాహన దారులకు రక్షణ కల్పించాలని మధు కోరారు . ఆన్‌లైన్ ఆటో డ్రైవర్ లకు(రాపిడ్ ఉబర్ ఓలా) రక్షణ కల్పించాలని, వారికి రూ. 60 పెంచాలని కోరారు.

రైల్వే స్టేషన్, ఆర్టీసి కాంప్లెక్స్, డి మార్ట్ తదితర బిజీగా ఉన్న ప్రాంతాల్లో ఆన్లైన్ డ్రైవర్లకు పాయింట్లు ఏర్పాటు చేయాలని మధు డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఆటో వారు ఆన్లైన్ డ్రైవర్ పై ఘర్షణలకు దిగుతున్నారని ఇది మంచి పరిణామం కాదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు వి. కొండలరావు, రవి సంతోష్, చిన్నబ్బాయి పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు రూ. 26వేల వేతనం ఇవ్వాలి 3లో..

హైవేల విస్తరణ అభ్యంతరాలు తెలపండి 5లో..

అంతర్ జిల్లాల కవల దొంగలు అరెస్ట్ 8లో..

సమస్యల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- తేమశాతం, గోనెసంచుల విషయంలో రైతుకు ఎటువంటి ఇబ్బంది కలుగకూడదు
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారులతో మంత్రి కొలుసు పార్థసారధి సమీక్ష

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని రాష్ట్ర గృహనిర్మాణశాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు,పౌర సరఫరాల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డితో కలిసి రాష్ట్ర

గృహనిర్మాణశాఖ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లోను రైస్ మిల్లును సంప్రదించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో ▶మిగతా 2లో..

విశాలాంధ్ర ప్రచురణలు అమూల్యం

శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: తెలుగు సాహితీ, సాంస్కృతిక రంగాల్లో ఎందరో గొప్ప కవులు చేసిన రచనలు సేకరించి ముద్రించి తెలుగు ప్రజలకు అందిస్తున్న విశాలాంధ్ర ప్రచురణాలయం కృషి శ్లాఘనీయమని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు.శుక్రవారం తణుకు పాలిటెక్నిక్ కళాశాల వద్ద విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన

పుస్తకాలను విశాలాంధ్ర ప్రచురణాలయం అందించడం గొప్ప విషయమన్నారు. విశాలాంధ్ర ▶మిగతా 2లో..

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి

కమిషనర్ కేతన గార్గ్

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసే ఆహారాన్ని మనం తీసుకోవడం ఎంత వరకు సమంజసం అని మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణంలో తయారు చేస్తున్న హోటళ్లను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ఆహార పదార్థాలను తయారు చేసే విధానం పరిశుభ్రత పాటించడం, అక్కడి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అపరిశుభ్రత వాతావరణంలో తయారు చేసే ఆహార పదార్థాలు తీసుకోవడం వలన అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, మనం అలాంటి ఆహారాన్ని తీసుకుంటామా? అంటూ ప్రశ్నించారు. ఆహార పదార్థాలు ఆకర్షణగా ▶మిగతా 2లో..

ఎమ్మెల్యేలకు ఝలక్

- కార్యకర్తలకు భరోసా...!
- రోడ్డు మ్యాప్ సిద్ధం చేసే పనిలో అధిష్టానం

విశాలాంధ్రబ్యూరో - ఏలూరు : ఏ నాయకుడిని, కార్యకర్తను పార్టీకి దూరం కానివ్వడానికి వీలు లేదని, ఏస్థాయి నాయకుడికైనా నష్టం జరగడానికి వీలులేని విధంగా టీడీపీ అధిష్టానం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. 2014-19 మధ్య శాసన సభ్యుల మీద పార్టీని వదిలేసి నష్టపోయిన పరిస్థితి కనపడింది. మరలా అదే విధంగా వ్యవహరిస్తే కొన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు చేసే అరాచకాలు, అక్రమ సంపాదన, క్యాడర్‌ను నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలతో రాబోయే ఎన్నికలలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని అధిష్టానం భావిస్తోంది. పార్టీ క్యాడర్‌ను ,కార్యకర్తలను, కాపాడుకోవడానికి రోడ్డు మ్యాప్ సిద్ధం చేసే పనిలో అధిష్టానం ఉన్నట్లు పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై తీవ్ర అసంతృప్తితో క్యాడర్ నలిగిపోతోంది.అలాంటి నియో జకవర్గాలలో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి చర్యలకు టిడిపి హై కమాండ్ సిద్ధమైనట్లు సమాచారం. పూర్తి సైంటిఫిక్ డేటా అధినేత తన వద్ద ఉంచుకొని అంతర్గతంగా సమీక్షిస్తున్నారు. దీంతో సమస్యలు ఉన్న నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలకు ఝలక్ తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

త్రీమెన్ కమిటీలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలు నియోజక వర్గాలలో క్యాడర్ ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల తీరుపై పూర్తి అసంతృప్తితో ఉంది. అలాంటి నియోజక వర్గాలలో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని టిడిపి అధిష్టానం కసరత్తు చేస్తోంది.

ఎమ్మెల్యేల తీరుపై చంద్రబాబు ఆగ్రహం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి కార్యకర్తకు నష్టం జరగడానికి వీలు లేని విధంగా తగిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ కేంద్ర కార్యాలయానికి గనుక ఎమ్మెల్యేల వలన ఇబ్బంది పడుతున్నాం అని, ఏదైనా సమస్య ఎమ్మెల్యే పరిధిలో ఉన్నప్పటికీ పరిష్కరించలేకపోవడం, కొన్నిచోట్ల కార్యకర్తలు ఆగ్రహంతో కట్టలు తెంచుకొని రోడ్లపైకి రావడం, మీడియా ముందు వారి ఆవేదన వెలి బుచ్చడం, అటువంటి వాటి గురించి ఆ ఎమ్మెల్యేలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేల ▶మిగతా 2లో..

ముదినేపల్లి ఎంపీడీవోగా రామకృష్ణ

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి ఎంపీడీవో గా యద్దనపూడి రామకృష్ణ ఈవోపీఆర్డీగా బి. కిషోర్, ఏఓగా ఎం.వి రమణారావు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముదినేపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన పి.మల్లే శ్వరి బదిలీపై నంది వాడకు బదిలీ అయ్యారు. పామర్రు ఎంపీడీవోగా పనిచేసిన రామకృష్ణ ముదినేపల్లి బదిలీపై వచ్చారు.ఇక్కడ ఈవో పీఆర్డీగా పనిచేసిన దూలం లక్ష్మీనారాయణ నిడదవోలు బదిలీ కాగా, బి. కిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఏవోగా పనిచేసిన రమణబాబు కృష్ణాజిల్లా పరిషత్‌కు బదిలీ కాగా పెదపారుపూడిలో ఏవోగా విధులు నిర్వహించిన రమణరావు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. వారిని కార్యాలయ సిబ్బంది, ఎన్ఆర్జిఇఎస్ సిబ్బంది అభినందించారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గం నుంచి వరద బాధితుల సహాయార్థం రూ 51.57లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ నాయకులంతా కలిసి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగ్గవరపు. ముత్తారెడ్డి, మాజీ జెడ్పిటిసి పెదబాబు, సీనియర్ పార్టీ నాయకులు మండవ. లక్ష్మణరావు, అట్లూరి. శ్రీనివాసరావు, కనుమతరెడ్డి, రాజారెడ్డి నియోజకవర్గ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గరిమెళ్ళ. చలపతి, మాటూరి. వెంకటరామయ్య, సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-లింగపాలెం: మఠంగూడెం పంచాయతీ శివారు చంద్రన్నపాలెంలో పురుగుమందు తాగి జి.గోపాలం(40) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గోపాలం బాధను భరించలేక పురుగుమందు తాగినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పురుగుమందు తాగిన ఇతన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం పోలీసులు వెల్లడించారు.

బదిలీపై వచ్చిన రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో బదిలీపై వచ్చిన రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయాలకు బదిలీపై వచ్చిన పలువురు ఉద్యోగులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.రెవిన్యూ కార్యాలయంలో 11 మంది గ్రామ రెవెన్యూ కార్యదర్శిలు వివిధ మండలాల నుంచి లింగపాలెం మండలానికి బదిలీపై వచ్చారు.వీరంతా బాధ్యతలు తీసుకున్నారు.గ్రామ రెవెన్యూ కార్యదర్శిలుగా బాధ్యతలు తీసుకున్న గ్రామ రెవెన్యూ పరిపాలన అధికారుల వివరాలు.యడవల్లికి ఎస్.ప్రసాద్,అయ్యపరాజుగూడెం గూడెంకు కె.గోపీనాథ్, వేములపల్లికి రాజు, కే.గోకవరం-1కు,కే.శ్రీనివాస్, కే గోకవరం-2 కు బాబు, కలరాయనగూడెంకు డి.లక్ష్మీనారాయణ, టి.సి.హెచ్.ఆర్ పాలెంకు ఎస్.అప్పారావు, నరసన్న పాలెంకు పి.శేఖర్,మఠం గూడెంకుజె.దీపిక, రంగాపురంకు రమణ, ముడిచర్లకు శేషవల్లి బాధ్యతలు తీసుకున్నారు. వీరంతా ఇతర మండలాల్లో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ సర్వేయర్ గా నాగబాబు, జూనియర్ అసిస్టెంట్ గా నిరీక్షణ బాధ్యతలు తీసుకున్నారు. వీరు స్థానంలో ఉన్న వారిని ఇతర మండలాలకు బదిలీ చేశారు. మండలంలోని పలు పంచాయతీలకు కార్యదర్శులుగా పలువురు బదిలీపై వచ్చారు.నరసన్న పాలెంకు వై.కిరణ్, బాదరాలకు ఆర్. సురేష్,రంగాపురంకు ఎం.చంద్రశేఖర్, యడవల్లికి బి.బాలకృష్ణ, ముడిచెర్లకు వై. చంద్రశేఖర్,ములగ లంపాడుకు ఎన్.రాధా కృష్ణను నియమించారు. ఇతర మండలాల్లో పనిచేస్తున్న వారు ఇక్కడికి బదిలీ అవ్వగా ఇక్కడ పనిచేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులను ఇతర మండలాలకు బదిలీ చేశారు.

డ్వామా పీడీగా వెంకట సుబ్బారావు

విశాలాంధ్ర-ఏలూరు : ఏలూరు జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె. వెంకట సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచేస్తున్న వెంకట సుబ్బారావు ను రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లా డ్వామా పీడీ గా నియమించింది. ఈ మేరకు డ్వామా ఆఫీస్ లో వెంకట సుబ్బారావు పీడీ గా బాధ్యతలు స్వీకరించారు. వెంకట సుబ్బారావుకు డ్వామా కార్యాలయం సిబ్బంది పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేలకు ఝలక్

(1వ పేజీ తరువాయి)

పనితీరును పార్టీ ఇంటిలిజెన్స్ టీమ్‌ల ద్వారా సమాచారాన్ని అధినేత ఇప్పటికే తెప్పించు కున్నారు. కొంతమంది సమయం వేచి చూసి సరిదిద్దుకుంటారా సరే...! లేదంటే పార్టీ సొంత యాక్షన్ ప్లాన్ తో నియోజకవర్గాలలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేసే ఆలోచనలో ఉన్నారు. విజయదశమి తరువాత దీనిపై అధినేత పార్టీ ముఖ్య నేతలతో చర్చించి ముందుగా మరి క్యాడర్ ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ఓ పది నియోజకవర్గాలలో దీనిని అమలు చేయాలని భావిస్తున్నారు. అధినేత ఇలాంటి నిర్ణయాలు తీసుకొని కార్యకర్తలను, క్యాడర్‌ను కాపాడటం మున్ముందు కూడా పార్టీకి మంచి రోజులు ఉంటాయని టిడిపి క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తోంది.

ప్రచురణలు అమూల్యం

(1వ పేజీ తరువాయి)

ప్రచురణలు అమూల్యమని పేర్కొన్నారు. జ్ఞాన సముపార్జనకు పుస్తకపఠనం ప్రతీ ఒక్కరికీ అవసరమన్నారు. దారిదీపం సంపాదకులు డీవీవీయస్ వర్మ మాట్లాడుతూ కందుకూరి, గురజాడ, శ్రీ శ్రీ లాంటి ఎందరో గొప్ప కవులు వ్రాసిన రచనలు సేకరించి ముద్రించి వాటిని వెలుగులోకి తెచ్చిన ఘనత విశాలాంధ్ర ప్రచురణాలయందే నన్నారు. తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాల్లో విశాలాంధ్ర ప్రచురణాలయం కృషి ఎనలేనిదన్నారు. లాభాపేక్ష లేకుండా మంచి రచనలు సేకరించి ముద్రించి ప్రజలకదించడమే ధ్యేయంగా విశాలాంధ్ర పనిచేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ మారుతున్న సామాజిక కాలమాన పరిస్థితులు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పుల కనుగుణంగా ప్రజలకవసరమైన పుస్తకాలను ప్రజల్లో అభ్యుదయ భావాలను పెంపొందించే రచనలు తెలుగు పాఠక లోకానికి విశాలాంధ్ర ప్రచురణాలయం అందిస్తూ ఎనలేని కృషి చేస్తున్నదన్నారు. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రతినిధి సూరిశెట్టి రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు అట్లు వెంకట్రావు,దాకే ముసలయ్య, సీపీఐ నాయకులు గార ప్రసాద్,నామన వెంకటేశ్వరరావు బండి సత్యనారాయణ, డివిఎన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు

(1వ పేజీ తరువాయి)

తేమ శాతం విషయంలో ఒకేసారి తేమ కొలిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఆయా రైతు సేవాకేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు మిల్లర్ల అసోసియేషన్ తరపున ఒకరిని ఉంచాలన్నారు. ధాన్యం రవాణాచేసే ప్రతి లారీలో ఖచ్చితంగా టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. రైతు గోనెసంచులు, హమాలీలు, రవాణా కానీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ లెక్కలప్రకారం ఆ పైకం నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లించబడుతుందనే విషయాన్ని రైతులకు తెలియజేయా లన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గోనెసంచుల విషయంలో రైస్ మిల్లులవద్దే వాటన్నింటిని పరిశీలించి సరైన రీతిలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే 7 లక్షల గోనెసంచులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురుకాకుండా జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని రైస్ మిల్లర్స్ ప్రతినిధి ప్రభాకర్, ట్రాన్స్ పోర్టర్ల సంఘం ప్రతినిధులు హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, డిఎఫ్ఓ రవీంద్రదామా, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి, డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్. రాజు,జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రైల్వేస్టేషన్

(1వ పేజీ తరువాయి)

సామర్లకోట రైల్వే స్టేషన్ జంక్షన్ శుక్రవారం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసింది. తమ ప్రయాణానికి రాకపోకల నిమిత్తం పలువురు సీట్లు రిజర్వేషన్ చేసుకోగా మరికొందరికి సీటు రిజర్వేషన్ కాకపోవడంతో తమ పిల్లలతో ప్రయాణం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ఇదే పరిస్థితి నెలకొంది. సామర్లకోట రైల్వే జంక్షన్ మీదుగా అటు విజయవాడ, ఇటు వైజాగ్ వైపు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలో సీట్లు అన్ని నెల క్రితమే భర్తీ అయ్యాయి. ఇప్పటికిప్పుడు ప్రత్యేక రైళ్లు వేస్తే తప్పా కాకినాడ జిల్లా రైలు ప్రయాణికుల ఇక్కట్లు తప్పేలా లేదు కానీ ఆదిశగా దక్షిణ మధ్య రైల్వే ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

షాలీమార్ నుండి చెన్నై,చెన్నై నుండి షాలీమార్ ప్రత్యేక రైలును రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన సామర్లకోట రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వలేదు. కాకినాడ జిల్లా రైల్వే ప్రయాణికులు ఎటువంటి ప్రత్యేక రైళ్లు లేక దసరా సెలవులలో తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆసుపత్రిలో పెన్షన్ అందజేసిన కార్యదర్శి ప్రసాద్

విశాలాంధ్ర-ఉంగుటూరు :ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామానికి చెందిన పెద్ది సుబ్బారావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాచుగుంట గ్రామపంచాయతీ కార్యదర్శి నీలం శివప్రసాద్ శుక్రవారం ఏలూరు ఆశ్రమ హాస్పటల్లో చికిత్స పొందుతున్న సుబ్బారావుకు పెన్షన్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెన్షన్ దారుడు ఎక్కడున్నా ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్నట్లు కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా కార్యదర్శి ప్రసాద్ ను పలువురు అభినందించారు.

జాబ్‌మేళాలో 110 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర - కైకలూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైకలూరులో శుక్రవారం ఏపి ఎస్.ఎస్.డి.సి, జే.కే.సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైకలూరు సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఇన్నోవా సోర్స్, నవత ట్రాన్స్పోర్ట్, వరుణ్ మోటార్స్,మోహన్స్ పెన్ టెక్స్, రిలయన్స్,అరబిందో ఫార్మాలగ్జరీ ల్యాండ్ లార్డ్ ప్రాజెక్ట్, బజాజ్ క్యాపిటల్ వంటి ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో 300కుపైగా నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ లకు హాజరయ్యారు. వారిలో 110 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైకలూరులో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 10 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే సుజాత తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ. ఎస్.ఎస్.డి.సి జిల్లా ప్లేస్మెంట్ అధికారి కే.ప్రవీణ్ కుమార్,యంగ్ ప్రొఫెషియన్ జి. ప్రవీణ్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి.ప్రసాద్, స్కిల్ హెబ్ ట్రైనర్ కె.సునీల్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ కె.సురేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏపీ ఎస్.ఎస్.డి.సి.కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థులచే భీమవరం డిజిటల్స్ స్టార్టప్

విశాలాంధ్ర -భీమవరం: ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న భీమవరం డిజిటల్స్ స్టార్టప్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ గురువారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వెబ్ సైట్ కూడా ఆయన విడుదల చేశారు.సి ఎస్ డి ఫైనలియర్ విద్యార్థులు ఎం. పృథ్వీ వర్మ , కె.సంజు, సిహెచ్.రవి కుమార్లు కలిసి "భీమవరం డిజిటల్స్"అనే స్టార్టప్‌ను రూపొందించారు.ఈ డిజిటల్ మార్కెటింగ్ స్టార్టప్ ద్వారా డిజిటల్ అడ్వర్టైజింగ్, వెబ్‌సైట్ డెవలప్మెంట్, యాప్ డెవలప్మెంట్,సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ వంటి సేవలను అందించనున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం జగపతి రాజు,ప్రిన్సిపాల్ కె.వి.మురళి కృష్ణం రాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాల కృష్ణమూర్తి, సి ఎస్ డి విభాగం హెడ్ డాక్టర్ ఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత నివ్వండి (1వ పేజీ తరువాయి)

ఉండేలా హానికరమైన రంగులు వాడడం, నిలవ ఉంచిన వాటిని తిరిగి ఒండడం వల్ల ఫంగస్ ఇన్ఫెక్షన్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. వంటకాల కోసం ఉపయోగించే నూనె వేడి చేసి ఒకసారి పదార్థాలు తయారు చేశాక, తిరిగి మళ్లీ మళ్లీ అదే వాడడం వల్ల క్యాన్సర్ వంటి రోగాల బారి నపడే పరిస్థితులు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారని కమిషనర్ కేతన గార్గ్ తెలిపారు. హోటళ్ళ నిర్వాహకులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆదేశాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెవెన్యూ కార్యాలయంలో ప్రక్షాళన పనులు

విశాలాంధ్ర-లింగపాలెం: రెవెన్యూ కార్యాలయంలో పరిశుభ్రత ప్రక్షాళన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయాన్ని2001లో నిర్మించారు. ఇప్పటివరకు కార్యాలయాన్ని ప్రత్యేకంగా మరమ్మతులు చేయలేదు.కార్యాలయంలో పనిచేస్తున్నఅధికారులు,సిబ్బంది వారికి అనుకూలంగా స్వల్ప మార్పులు చేసుకుంటూ ఉంటున్నారు.అప్పట్లో పలు మొక్కలు నాటారు. ఇవి పెద్దవై కొన్ని అంతరాయంగా ఉన్నాయి. చెట్లు పెద్దవి అవటంవల్ల కార్యాలయపు భవనం పై కప్పు పై కొమ్మలు, ఆకులు పడటంతో స్లాబు ప్రమాదంగా మారింది. వర్షపు నీరు కిందికి దిగే వీలు లేకుండా ఉంది. దీనివల్ల స్లాబ్ పైనుంచి గదుల్లోకి నీరు దిగుతుండటంతో ప్రమాదకరంగా మారింది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగటమేకాక ప్రమాదంగా మారింది. పలుచెట్లు కార్యాలయ ఆవరణలో ప్రమాదంగా ఉన్నాయి. కార్యాలయాన్ని ప్రక్షాళన చేసేందుకు తహసీల్దార్ నజీమ్ చర్యలు చేపట్టారు. స్లాబును పరిరక్షించేందుకు దాని పైకి వస్తున్న చెట్లను తొలగించారు. స్లాబును మరమ్మతు చేసే పనులు చేపట్టారు. తొలగించిన చెట్ల స్థానంలో హైబ్రిడ్‌కు చెందిన పలు రకాల మొక్కలను నాటిస్తామని ఈయన తెలిపారు. కార్యాలయపు ఆవరణలో ధపాల వారీగా పర్యావరణాన్ని పరిరక్షించే పనులు చేయిస్తామని తెలిపారు. కార్యాలయంలో పని చేస్తున్న వారు, కార్యాలయానికి వచ్చే వారివాహనాలను ఉంచేందుకు, కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించే ఏర్పాట్లు చేయిస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తిరుపతి ఐఐటి డీన్ అకడమిక్ అఫైర్స్ డాక్టర్ రామకృష్ణ గొర్తి సూచించారు. నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి,రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఈసీఈ విభాగం,ఈసీఈ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీప్ లెర్నింగ్ అండ్ కంప్యూటర్ విజన్ అనే అంశంపై రవీంద్ర కళాభారతిలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.యువరాజు అధ్యక్షత వహించగా ఆచార్యులు డాక్టర్ పులి కిషోర్ కుమార్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈసీఈ అసోసియేషన్ 07ను ప్రారంభించారు.అనంతరం డీన్ లు,ఆచార్యులు రామకృష్ణను ఘనంగా సత్కరించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ టి.కురుమయ్య,డాక్టర్ జీవి వీరేష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ జి.కిరణ్ కుమార్, డాక్టర్ కృష్ణ చైతన్య,డాక్టర్ నర్సింహారావు, డాక్టర్ వి.సందీప్, అసోసియేషన్ కార్యదర్శులు విష్ణువర్ధన్, వికాస్ రెడ్డి,అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు ఆర్డీవోగా వాణి

విశాలాంధ్ర- నూజివీడు :నూజివీడు ఆర్డీవోగా ఎం.వాణి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మచిలీపట్నం ఆర్డీవోగా బాధ్యతలను నిర్వర్తించిన వాణి సాధారణ బదిలీలలో భాగంగా నూజివీడు ఆర్డీవో గా వచ్చారు. శుక్రవారం బాధ్యత స్వీకరించిన ఆమె నూజివీడు ఆర్డీవో కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకుని సమస్యలను గుర్తించడంతోపాటు ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల నుండి వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.

అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ కు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని ఏఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా మంచి ప్రభుత్వం పేరుతో సంబరాలు చేసుకుంటున్న పాలకులకు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ వెతలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 42 రోజులు దీక్షలు చేసినప్పుడు నాటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం అంగన్వాడి దీక్ష శిబిరాలను సందర్శించి వారికి మద్దతు ప్రకటించిన విషయం గుర్తు చేశారు.

చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పిస్తూ,గర్భవతులకు పౌష్టికాహారం అందజేస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వారికి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, పక్క ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ఏఐటీయూసీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

నూజివీడు మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర- నూజివీడు :నూజివీడు మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమా లపై సమీక్ష నిర్వహించారు. వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వివిధ పంచాయతీల్లో మంజూరైన రహదారులు మురుగు కాలువలకు సంబంధించి వివరాలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఉద్యాన వన శాఖ పరిధిలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పంట ప్రోత్సాహాల గురించి హెచ్.ఓ.ఆర్.హేమ వివరించారు. ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ తాగునీరు వ్యవసాయ సమస్యల పరిష్కారం, ఉద్యానవన పంటల సమస్యల పరిష్కారం ప్రధానమైనవి అన్నారు.ఎంపీపీ శిరీష మాట్లాడుతూ మండల పరిషత్ కార్యా లయంలో సమావేశ మందిరం లేకుండా పోయిందని ఇది నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గుడిమెల్ల కృష్ణంరాజు,వైస్ ఎంపీపీ దండు బోయిన స్వర్ణలత, ఇంచార్జ్ తహసీల్దార్ సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ సింగ్, పిడిఎస్ డీటీ వెంకటేశ్వరరావు, ఎన్. సోమేశ్వరి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టు సిబ్బంది జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సూపర్వైజర్లకు పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ముందు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ గుత్తేదారులు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించట్లేదన్నారు.గత నాలుగు నెలల నుండి జీతాలు పెండింగ్ ఉండటం వల్ల కార్మికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల అకౌంట్లో జీతాలతో పాటు పీఎఫ్‌లు కూడా జమ చేయాలని, గుత్తేదారి వ్యవస్థను రద్దు చేయాలన్నారు.పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్ లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్,ఈఎస్ఐ, చెల్లించడంతోపాటు ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, రమాదేవి, సత్యవతి, ఆదిత్య,సుమలత, సుందరి, కనకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నిరోధించాలి

విశాలాంధ్ర-తణుకు: పశ్చిమగోదావరి జిల్లా భవన కార్మిక సంఘం (ఏఐటియుసి) ఆధ్వర్యంలో శుక్రవారం వేల్పూరు భవన కార్మికుల యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు మార్ని మల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమ వేశంలో జిల్లా అధ్యక్షులు బొల్లాడ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక విధానం పూర్తిగా విఫలమైందని అన్నారు. అక్రమ రవాణా ద్వారా అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. నిర్మాణ యజమానులు ఇసుక అందడం లేదని ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో అనేక లోపాలు ఉన్నా యన్నారు. లారీ యజమానులు సిండికేటై బ్లాక్ మార్కెట్ నడిపిస్తున్నారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఉచిత ఇసుక ఖచ్చితంగా భవన యజమానులకు అందేటట్టు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం ప్రభాకర్ రావు, బందారు కోట నాగేశ్వరరావు, ఆకుల కృష్ణ కిషోర్, మార్ని రమేష్, ఈదర రాము, రెడ్డి ఆనంద్,మంగన రాజు, మంగన రాజు, ఎడ్లపల్లి శ్రీను, కొండేటి వెంకట రంగారావు, మచ్చ యేసు, కోటిపల్లి కరుణ, మెంటు రమేష్, పెన్నాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూజివీడు ఆర్డీవో

విశాలాంధ్ర-ఏలూరు: నూజివీడు ఆర్డీఓగా నియమితులైన యం. వాణి శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలుసుకొని పూలమొక్కను అందజేశారు. గతంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన వాణి నూజివీడుకు బదిలీపై వచ్చారు.

దివ్యాంగులకు ఎన్నారై కుటుంబం సాయం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: అమెరికాలో నివాసముంటూ ఇటీవల పరమపదించిన డాక్టర్ ఇమ్మాది రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రెండు కాళ్ళు కోల్పోయిన 4గురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు అందచేయడం అభినందనీయమని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విశ్రాంత అధ్యాపకురాలు ఉప్పలపాటి మణి కుమారి అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రెండు కాళ్ళు కోల్పోయిన నలుగురిలో ఒకరైన విజయనగరం జిల్లాకు చెందిన కెల్లా రాముకు ఆమె చేతులమీదుగా రెండు కృత్రిమ కాళ్ళు అందచేసిన సందర్భంగా మాట్లాడారు. దివంగతులైన డా.రామకృష్ణ అమెరికాలో గొప్ప పేరు ప్రఖ్యా తులు గల వైద్యులన్నారు.ఈ కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సి.ఈ.ఓ.కూరపాటి అజయ్ కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల అభివృద్ధికి కృషి చేస్తానని కొయ్యలగూడెం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా తణుకు నుండి కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై రావడం జరిగిందని తెలిపారు.కార్యాలయంలోని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో కిరణ్ కుమార్ ను మండలంలో ఉన్న వివిధ పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

త్రాగునీటి కొరత నివారిస్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :గ్రామపంచాయతీ పరిశుభ్రతకు, అభివృద్ధికి, గ్రామ ప్రజలకు మంచి నీటి కొరత లేకుండా కృషి చేస్తా అని పరింపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె. సురేష్ తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి కొయ్యలగూడెం మండలం పరింపూడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్య తలు చేపట్టినట్టు సురేష్ పేర్కొన్నారు. ఉన్నత అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అమరావతి, విజయవాడ, ఏలూరుల్లో సుడిగాలి పర్యటన చేశారు.తొలుత దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తో జరిగిన రాష్ట్ర ఎంపీల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు స్టేషన్లో

కాకినాడ - జోధ్ పూర్ ఎక్స్ ప్రెస్,భావ్‌నగర్ ఎక్స్ ప్రెస్, యాశ్వంత్ పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, నూజివీడు స్టేషన్ లో గౌతమి ఎక్స్ ప్రెస్, నిలుపుదల చేయాలన్నారు. నూజివీడు రైల్వేస్టేషన్ లో ప్రయాణీకుల వెయిటింగ్ హాలు,జనరల్ వెయిటింగ్ హాలు,డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ గది, వెయిటింగ్ లాంజ్,ప్లాట్ ఫామ్-1 లో 4 ప్యాసింజర్ షెడ్లు నిర్మాణం, ప్లాట్ ఫామ్-2 లో 4 పాసెంజర్ షెడ్ల నిర్మాణం,అన్ని ప్లాట్ ఫామ్స్‌కు అప్రోచ్ రోడ్ల నిర్మాణం మరుగు దొడ్ల నిర్మాణం,లిఫ్ట్ సౌకర్యం, బెంచీల ఏర్పాటు,ప్లాట్ ఫామ్ 2 లో 24ఐ7 టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.రైళ్ళల్లో జనరల్, స్లీపర్ భోగీలను పెంచాలని కోరారు. రైతాంగానికి, పారిశ్రామిక రంగానికి కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొవ్వూరు - భద్రాచలం రోడ్ మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైను ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలని కోరారు.అనంతరం రాష్ట్ర మానవవనరుల, ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్‌ను కలిసి కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, హెూంశాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ను కలిసి కొయ్యలగూడెంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమం అనంతరం విజయవాడలో రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్ గా బొరగం శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై,వారికీ పుష్పగుచ్ఛము అందించి, అభినందించారు.సాయింత్రం ఏలూరు ఏఎస్సార్ స్టేడియంలో మోహనకుమార్ మెమోరియల్ స్టేట్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభించారు.

ఇసుక కొరతపై భవన నిర్మాణ కార్మికుల నిరసన

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల: రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని వెంటనే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇసుక కొరత ఏర్పడడంతో భవన నిర్మాణ కార్మికు లందరికీ ఉపాది లేకుండా పోయింద న్నారు. వేలాది మంది భవన నిర్మాణ

కార్మికులతో పాటు అనుబంధ రంగాల్లోని కార్మికులు రోడ్డున పడ్డారని యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం యూనియన్ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదికృష్ణ, దాసరి శ్రీనివాసరావు, ఎన్.మణి, మునేశ్వరరావు, బొంతు శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు ఎంపీడీవోగా మంగా కుమారి

విశాలాంధ్ర-పోడూరు : పోడూరు మండల ఎంపీడీవోగా బి.శ్రీలక్ష్మి మంగా కుమారి శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. టి.నర్సాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న బి. శ్రీ లక్ష్మి మంగా కుమారి

సాధారణ బదిలీలలో భాగంగా పోడూరు మండలానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీపై వచ్చారు. ఇంతవరకు పోడూరు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన డి. సుహాసిని కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. పోడూరు ఎంపిడీఓగా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీ లక్ష్మి మంగాదేవికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో 9,10 వార్డులలో మురుగునీరు పారుదల లేక ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు మండల నాయకులు బుగ్గల ప్రభాకర్ విమర్శించారు. శు క్రవారం వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు చాటపర్రు 9,10 వార్డులలో మురుగు డ్రెన్లు ను పరిశీలించారు. 9వ వార్డులో మురుగునీరు పారుదల లేక తీవ్ర దుర్గంధం వస్తుందని, దీనివలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని విమర్శించారు. పదో వార్డులో మంచినీరు పైప్ లైన్లకు మురుగునీరు చేరి నీరు కలుషితంగా వస్తుందని తెలిపారు. ఈ విషయాలపై గ్రామ కార్యదర్శికి విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల క్రితం జిల్లా కలెక్టర్ కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి సమస్యను పరిష్కరించమని ఆదేశాలు ఇచ్చిన ప్పటికీ ఇప్పటివరకు సమస్యను పరిష్క రించలేదన్నారు.

అక్కడ ప్రజలు వ్యవసాయ కార్మిక నాయకుల దృష్టికి తీసుకువచ్చారని ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి చాటపర్రు 9,10 వార్డుల డ్రైనేజీ, త్రాగునీరు సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీపీఐ మండల మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలంలో ఈనెల 20న జరిగే సీపీఐ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు జె.వి.రమణరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం గొల్లగూడెం, తిమ్మాపురం, కోడిగూడెం గ్రామాల్లో ప్రథమ మహాసభ సన్నాహక సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా రమణరాజు మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలో జరిగే మొదటి సీపిఐ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సభలో ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఇతర నాయకులు పాల్గొంటా రన్నారు. డప్పుకళాకారుల సంక్షేమసంఘం రాష్ట్రవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ డప్పు కళాకారుల సంక్షేమానికి సంఘం కట్టుబడి ఉందని, వీరి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ద్వారకాతిరుమల మండల నాయకులు గులిమే బాల ఏసు మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో డొక్కా వెంకటేష్, ఎర్లపల్లి రమేష్, వసంతవాడ మోహనరంగారావు, ఉండి వెంకటేష్, డొక్కా పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

కుల సర్టిఫికెట్లు ఇప్పించండి

విశాలాంధ్ర-కామవరపుకోట: ఏలూరు జిల్లా కామవరపుకోటలో ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న తమకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను అందజేయాలంటూ కామవరపు కోటకు చెందిన పలువురు నాయక కులస్తులు శుక్రవారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రులు, తెదేపా రాష్ట్ర నాయకులు వద్ద మొరపెట్టుకున్నారు. గతంలో తమ నాయక కులస్తుల పిల్లల చదువులకు, పెద్దల సంక్షేమ పథకాలు పొందుట కొరకు తమకు ఎస్టి సర్టిఫికెట్లను అందజేశారని తెలియజేశారు. కానీ ఒక ఏడాది కాలంగా తమ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవ డంతో పిల్లల చదువులతో పాటు తాము అన్ని విధాలుగా నష్టపోయా మని రాష్ట్ర పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్లు తెలిపారు. తమ పిల్లల చదువులకు, తమకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా ఎస్టీ సర్టిఫికెట్లను జారీ చేయాలని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి. ఫరూక్, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌లను కలిసి సమస్యను పరిష్కరించా లని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, దాన్ దివాకర్, నల్లమోతుల సత్యనారాయణ, గోధుమ మధు, గోధుమ రాధాకృష్ణ, బింగి ఏసు, మురళి, శివ, విల్సన్ తేజ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

చక్క వాణి లక్ష్మి ప్రియ, భర్త లేటు వెంకటేశ్వరరావు చెందిన ఏలూరు జిల్లా, ఏలూరు తూర్పు వీధికి చెందిన కాపురస్తులు అను నేను ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా ఇంటి దగ్గర నుండి నేను ఒరిజినల్ పాస్‌పోర్టు ఐడి నెంబర్ N 7715838 గలది కలిగి ఉన్నాను ది. 18-09-2024 తేదీన సదరు పాస్‌పోర్ట్ జిరాక్స్ నిమిత్తము ఒక కవర్లో పెట్టుకుని మా ఇంటి దగ్గర నుండి కుండీ సెంటర్‌కు వెళ్ళేచుండగా మార్గమధ్యంలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన కవరు జారి పడిపోయినది ఎంత వెతికినా దొరకలేదు కావున ఎవరికైనా దొరికిన యెడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఫోన్ నెంబర్ 7022112222

అగ్ని బాధితునికి సీపీఐ సహాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : అగ్ని ప్రమాదం వలన నష్టపోయిన కన్నాయిగుట్ట గ్రామానికి చెందిన కుంజా ముత్యాలరావుకు భారత కమ్యూనిస్టు పార్టీ శుక్రవారం సహాయం అందించింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో తన పూరిల్లుతో పాటు ఇంట్లో సామాగ్రి కాలిపోయి కట్టుబట్టలతో ఆ కుటుంబం రోడ్డున పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుని జీవించే కుటుంబానికి ఇటువంటి ప్రమాదం జరగటం దురదృష్టకరమన్నారు. సర్వం కోల్పోయిన బాధితునికి అండగా ఉండాలని పార్టీ నాయకులు దాతలకు విజ్ఞప్తి చేశారు. నిత్యవసర వస్తువులతో పాటు దుస్తులను వారికి అందించారు. నష్టపోయిన కుటుంబానికి తక్షణ సహాయం కింద పదివేలు అందజేయాలని, పూర్తి ఆస్తి నష్టం అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర మధు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన పరిశోధన కేంద్రం భూమిని సర్వే చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విత్తన పరిశోధన కేంద్రం భూమిని సర్వే చేసి వ్యవసాయ శాఖకు అప్పగించాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాల రాజు

తెలిపారు. అల్లంచర్ల రాజుపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 70లోని ప్రభుత్వ భూమిని కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విత్తన పరిశోధన కేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని తమకు స్వాధీనం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరిన నేపథ్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి జాయింట్ సర్వే జరిపించి ప్రభుత్వానికి సంబంధించిన 40 ఎకరాల భూమిని వ్యవ సాయ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో 105 మంది పేదలకు ఇచ్చిన డి ఫామ్ పట్టా భూములను సబ్ డివిజన్ చేయించి భూమిలేని పేదలకు పంచే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎడిఏ నాగ కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడపా నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామమూర్తి,మాజీ జడ్పీటీసీ నల్లూరి వెంకట చలపతి రావు,సర్పంచ్ నార్ని వెంకట్రావు, మాజీ సర్పంచ్ కలిశెట్టి పార్థసారథి, మండల వ్యవసాయ అధికారిణి బి. సుమలత తదితరులు పాల్గొన్నారు.

గణపవరం ఎంపీడీవోగా శ్రీలక్ష్మి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఆర్. బేబీ శ్రీలక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇప్పటివరకు కొయ్యల గూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వచ్చారు. ఇప్పటి

వరకు ఇన్చార్జి ఎంపీడీవోగా పనిచేసిన కె. సూర్యనారాయణ బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళుతున్న కె సూర్యనారాయణ కార్య దర్శులను సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఉత్తమ అవార్డు తీసుకున్న కండక్టర్‌పై అక్రమ సస్పెన్షన్ను ఎత్తివేయాలని కోరుతూ ఏలేశ్వరం డిపో ఆర్టీసీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టడంతో ఆందోళన తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ సందర్భంగా డిపో కార్మిక ఉద్యోగులు అన్ని యూనియన్లు జేఏసీగా ఏర్పడి కండక్టర్ నల్ల శ్రీనును అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం డిపో గేటు వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ డిపోలోను అమలు కానీ సర్కులర్లను తీసుకువచ్చి ఏలేశ్వరం డిపో మేనేజర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉత్తమ కండక్టర్గా అవార్డు అందుకున్న నల్ల శ్రీనును అక్రమంగా సస్పెండ్ చేయడం ఉద్యోగ భద్రతకే ప్రశ్నార్థకారంగా మారిందని అన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలో డ్రైవర్లు ఐఎస్‌వి రమణ, టీవీపి రెడ్డి, ఎల్ఎల్ రావు పాల్గొన్నారు. నల్ల శ్రీను సస్పెన్షన్ వ్యవహారంలో డిపో మేనేజర్ మానవ దృక్పథంతో ఆలోచించి రద్దు చేయవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వి రావు, కే త్రిమూర్తులు, పి సత్యానంద, గ్యారేజీ చలం, అప్పల రాజు, బిఎస్ రావు, ఎల్‌విఎస్ నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా జగదీశ్వరి

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మాజీ ఎమ్మెల్యే చిలా జగదీశ్వరీని నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలు అందుకున్నా జగదీశ్వర శనివారం విజయవాడలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చిలా జగదీశ్వర సంస్థ డైరెక్టర్‌గా ప్రమాణం చేస్తున్నారు. పూర్వపు అల్లవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఐదేళ్లు పనిచేసిన జగదీశ్వర మంచి పరిపాలనా దక్షురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఆమె నియామకం పట్ల పలువురు తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, అభినందనలు తెలిపారు. తనను గుర్తించి పదవి నిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

7న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 7న సోమవారం "వికాస" కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో "జాబ్‌మేళా" నిర్వహిస్తు న్నారు. ఈ జాబ్‌మేళాలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో గోల్డ్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్‌ఆఫీసర్, ఎస్‌బిఐ కార్డ్‌లో సేల్స్ ఆఫీసర్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నిషియన్, హెల్పర్, కెమిస్ట్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్, ఇసుజు మోటార్స్, పానాసోనిక్, డిఐసిసి & ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ & బి టెక్ ఉత్తీర్ణులైన 35సం. లోపు అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులందరూ "వికాస" కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరు కావలెను. వివరాలకు 7799376111, డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. వికాసజాబ్స్.కాం సంప్రదించవలెను.

హైవేల విస్తరణ అభ్యంతరాల పరిశీలన

విశాలాంధ్ర - రాజోలు : జాతీయ రహదారి-216 విస్తరణ అభివృద్ధి పనులపై వస్తున్న అభ్యంతరాల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం రాజోలు మండలం శివకోటి లాకులను ఆయన పరిశీలించారు. విస్తరణ పనులకు అడ్డంకిగా ఉన్న విలువల గణనలో వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయేమో పునఃపరిశీలన చేసి తాజాగా నివేదిక అందించాలని ఆదేశించారు. శివకోడులో జలవనరులశాఖ లాకు దెబ్బతినే అవకాశాలపై కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రహదారి విస్తరణలో భాగంగా లాకుల వద్ద నుంచి రహదారి ఎలైన్ మెంట్ ఉంది ఇదే కొనసాగితే లాకుల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో 16 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షించి లాకులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఇరిగేషన్ ఎఈఈ రమేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సంచాలకులు జిల్లా వనరుల కేంద్రం అధికారులకు పొలంబడి కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం కాకినాడ కృషి భవనంలో ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమం గురించి, అందులో క్వాలిటీ కంట్రోల్ మేనేజ్మెంట్ భాధ్యతలు వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా క్షేత్ర తనిఖీ అధికారి, ఆడిట్ అధికారి చేయవలసిన కార్యక్రమాలు, గ్యాప్ పొలంబడి యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆఫీస్ నుంచి వచ్చిన వ్యవసాయ అధికారి లక్ష్మీ రెడ్డి, రాష్ట్ర సర్టిఫికేషన్ విభాగానికి సంబంధించిన అధికారి యుగంధర్ కులంకుశంగా అధికారులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకుల ఎన్ విజయ్ కుమార్ గ్యాప్ పొలంబడి ఆవశ్యకత, సర్టిఫికేషన్ వలన రైతులకు కలుగు ప్రయోజనాలు గురించి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పథకం సంచాలకులు జ్యోతిర్మయి, ఉమ్మడి జిల్లా వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

7న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట : 7న జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉదయం 9 గంటల నుంచి దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లిమ్కా సంస్థ సహకారంతో విభిన్నప్రతిభావంతులు ఉపకరణాలు అందించేందుకు గతంలో జగ్గంపేటలో శిబిరం నిర్వహించారు. ఆ శిబిరంలో మంజూరైన లబ్దిదారులకు అందించే చార్జిబుల్ ట్రై సైకిల్లు, ట్రై సైకిల్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు వంటివి జగ్గంపేట చేరుకున్నాయి. వాటిని శుక్రవారం ఎమ్మెల్యే నెహ్రూ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాలు నిబద్ధతతో పనిచేస్తుంది అనడానికి నిదర్శనం దివ్యాంగులను ఆదుకునేందుకు శిబిరం ఏర్పాటు చేసి, వారికి కావలసిన పనిముట్లను గుర్తించి 350 మందికి 550 ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మారిశెట్టి భద్రం, కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర, బదిరెడ్డి అచ్చన్న దొర, గల్లా రాంబాబు, కొండ్రోతు శ్రీను, మండల అభివృద్ధి అధికారి, ఏపీఓ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పుత్ర శోకంతో ఆగిన తల్లి గుండె

విశాలాంధ్ర - అంబాజీపేట : తనయుని మరణ వార్త తట్టుకోలేని తల్లి హృదయం విలవిల్లాడింది. తలకొరివి పెట్టాల్సిన చిన్న కుమారుడు ఇక లేడు అన్న బాధతో తల్లి గుండె ఆగిపోయింది. దీనికి సంబంధించిన వివరాలు యిలా ఉన్నాయి. అంబాజీపేటకు చెందిన మద్దింశెట్టి ఆదినారాయణ (ఆదిబాబు)46 అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. దీంతో మరణ వార్త విన్న తల్లి మహాలక్ష్మి (72) ఉదయం హార్ట్ ఎటాక్‌తో కన్నుమూశారు. విజయవాడ నుండి ఆది బాబు మృతదేహం అంబాజీపేట రాకుండానే తల్లి అసువులు బాసింది. ఆదినారాయణ ఇందుపల్లిలోని ఏ కన్వెన్షన్ హాల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. గతంలో చిరంజీవి, పవన్ కళ్యాణ్ సేవా సమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య లక్ష్మీ పార్వతి దేవి మాచవరం, గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు. ఆదిబాబు సోదరులు వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు గతంలో మృతి చెందారు. మూడో సోదరుడు రామకృష్ణ అంతవరకు ఆచూకీ లేకుండా పోయింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆదిబాబు స్వగృహానికి చేరుకుని జరిగిన సంఘటనపై కన్నీటి పర్యంతమయ్యారు.

జెఎన్‌టీయూకే అధికారులచే సిద్ధాంత వ్యాసం ఆమోద ముద్ర

విశాలాంధ్ర - కాకినాడ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు కెవిఎస్ఎం రమేష్ సిద్ధాంత వ్యాసం "రిస్క్ అసెస్మెంట్ అండ్ ఆప్షన్ ప్రైసింగ్ మోడల్స్ ఫర్ ఎఫెక్టివ్ ఈక్విటీ మేనేజ్‌మెంట్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో లభించినది. కెవిఎస్ఎం రమేష్ తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యుసిఇకె) సిఎస్ఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా జెవిఆర్ మూర్తి మరియు గుంటూరు జిల్లా వడ్డేశ్వరం లోని కెఎల్ఈఎఫ్ యూనివర్శిటీ సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా జెకెఆర్.శాస్త్రి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

కోనసీమ తిరుమల హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం ఈనెల కోటి రూపాయలు దాటింది. గురు వారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హుండీలు తెరిచి లెక్కింపు ప్రారంభించారు. 35 రోజులకు ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.90,26,494, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ. 18,63,141 వెరసి రూ. 1,08,89,635 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. అలాగే 19 గ్రాముల బంగారం, 735 గ్రాముల వెండి పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీ నుంచి రూ. 2,36,510 ఆదాయం వచ్చిందని తెలిపారు. రాజమహేంద్రవరం తనిఖీదారు టివిఎస్ ప్రసాద్, రాజోలు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎస్‌వి ప్రసాద్ రాజు పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, వాడపల్లి ఉపసర్పంచ్ పి బాబూరావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, అర్చకస్వాములు, గ్రామస్తులు, రావులపాలెం కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్య ప్రకాష్ బాధ్యతల స్వీకరణ



విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల ఇంజనీరింగ్ అధికారిగా ఎం సత్యప్రకాష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మండల ఇంజనీరింగ్ అధికారి నాగేశ్వరావు కృష్ణాజిల్లా అగిరిపల్లెకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఏం సత్య ప్రకాష్ తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యత చేపట్టిన సత్య ప్రకాష్, ఎంపీపీ జీకే సుధాకర్, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబులను మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

H.M.O.P. NO: 60/2024

బిట్వీను:

పిటీషనరు: ముగొండ హేమ దుర్గ

మరియు

రెస్పాండెంటు: ముగొండ శ్రీనివాస రావు

పై నెంబరు పిటీషనులో పిటిషనరు అయిన ముగొండ హేమ దుర్గ రెస్పాండెంటు అయిన ముగొండ శ్రీనివాస రావు అను మీకు కోర్టుద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున, ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలున్న యెడల 16-10-2024 సం.రం. తేదీన ఉదయం 10 గంటలకు ఖుద్దునగాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై కోర్టువారితో మనవి చేసుకోవలసినది, లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని యీ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

రెస్పాండెంటు అడ్రస్సు: ముగొండ శ్రీనివాస రావు, తండ్రి సత్యనారాయణ, C/o. రాజ హెయిర్ స్టైల్స్, వెదిరేశ్వరం రోడ్, కోనసీమ కళ్యాణమండపం ఎదురుగా, ఎంటెజార్ ఫంక్షన్ హాల్ ప్రక్క, రావులపాలెం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

డి.మోహన్ మూర్తి, ఎం.ఎ., ఎల్.ఎల్.బి.,
వి.కుమార స్వామి, ఎం.ఎ., బి.ఎల్.,
పిటీషనరు తరుపు న్యాయవాదులు, పాలకొల్లు.
సెల్: 9290564185

బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణ

విశాలాంధ్ర - జగ్గంపేట : దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోవ రోజు శుక్రవారం బాలా త్రిపుర సుందరీ దేవిగా కనకదుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కనక దుర్గమ్మ తల్లి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా దేవి సెంటర్ అమ్మవారిని రెండవ రోజు బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. పురోహితులు మామిళ్లపల్లి అయ్యప్ప అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నాళం సూరిబాబు అమ్మవారికి అలంకరణ నిమిత్తం చీరను బహుకరించారు. అలాగే మండలంలోని జె కొత్తూరు గ్రామ శివారున ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద భవానీలకు, భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

రైల్వే స్టేషన్లో స్వచ్ఛత పక్వాడ

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట రైల్వే స్టేషన్లో శుక్రవారం అధికారులు సిబ్బంది కొలాహలంగా స్వచ్ఛత పక్వాడ నిర్వహించారు. స్వచ్ఛత మహోత్సవంలో భాగంగా స్టేషన్‌ప్లాట్ ఫామ్స్‌పై వ్యర్థాలను తొలగించి, క్లోరినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్టేషన్ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూపరిండెంట్ రమేష్ కోరారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి, చీఫ్ టికెట్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మల కొలువుతో పిల్లల్లో కుతూహలం

విశాలాంధ్ర - జగ్గంపేట : బొమ్మల కొలువులో ప్రాచీన వస్తువులతో పాటు ఆధునిక వస్తువుల గురించి పిల్లలకు తెలియజేయడం ద్వారా వారిలో కుతూహలం, ఉత్సాహం కలుగుతుందని ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ అన్నారు. మండలంలోని మల్లిసాల అంగన్వాడీ కేంద్రంలో దసరా సందర్భంగా శుక్రవారం బొమ్మల కొలువు మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా దసరాలో బొమ్మల కొలువు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్వసిద్ది సూకరత్నం, ఎంపిటిసి కనుమరెడ్డి సూర్యకుమారి, తెలుగు దేశం నాయకులు పైడిపాల సూర్యనారాయణ, ఐసిడిఎస్ రాజపూడి సెక్టార్ సూపర్ వైజర్ ఎస్ అమ్మాజీ, తమ్మంగి కృష్ణ, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని పెదపళ్లకు చెందిన ఏడిద రవికుమార్ అనారోగ్య కారణాలతో చికిత్స తీసుకుంటున్నారు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని రవికుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

గాయత్రి దేవి అలంకరణ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రెండవ రోజు శ్రీ విజయదుర్గ అమ్మవారినీ గాయత్రి దేవిగా అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి విజయదుర్గా ఆలయం, గజ్జనపూడి రాజరాజేశ్వరి ఆలయం, ధర్మవరం శ్రీ విజయ దుర్గ ఆలయం వద్ద కుంకుమ పూజ నిర్వహించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు నివారించండి : సీపీఐ

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు నియోజకవర్గంలో వేళపాల లేకుండా కరెంటు కోతలు విధిస్తున్నారని, దీనివలన వృద్ధులు, పిల్లలు, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు విద్యుత్ కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ చార్జీలను పెంచవద్దు అంటూ మలికిపురం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత మలికిపురం సెంటర్ నుంచి సబ్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించి, సబ్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే వైరల్ తదితర జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆసుపత్రిలో సైతం విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని, తక్షణమే అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ తదితర పేర్లతో మరో రూ.8,100 కోట్ల అదనపు విద్యుత్ భారాన్ని ప్రజల మీద వేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన అన్నారు. గతంలో రెండు నెలలకు చెల్లించే అదే బిల్లును ప్రస్తుతం ఒక నెలకే చెల్లించడం అంటే ప్రజల నెత్తిన మరింత భారాన్ని మోపడమే అని ఆయన విమర్శించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిచ్చిక గంగాధర్ రావు, చెల్లిబోయిన తాతారావు, మేడిచర్ల సత్యనారాయణ, కొండ సత్తిబాబు, పుల్లెల.ఆనంద్, వై వెంకట్, దీపాటి గంగా చలం, బత్తుల రవి ప్రసాద్, ఎడ్ల నాగేశ్వరరావు, ఆదాం, సుప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోగా ఎస్ మల్లిబాబు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాల యం డిప్యూటీ సీఈవోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా, కాకినాడ ఆర్డీవోగా నియమితులైన ఎస్ మల్లిబాబు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో డా డి తిప్పేనాయక్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవోగా ఎస్ మల్లిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ మండలాల తహశీల్దార్‌గా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారిగా, పెద్దాపురం ఆర్డీవోగా, సెట్ రాజ్ సీఈవోగా పనిచేసిన అనుభవంతో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ కాకినాడ రెవెన్యూ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందన్నారు.

గాయత్రిదేవి అలంకరణ

విశాలాంధ్ర - పెద్దాపురం : స్థానిక వర్మల వారి వీధిలో వేంచేసిన శ్రీభువనేశ్వరి పీఠంలో రెండవ రోజు శుక్రవారం భువనేశ్వరి అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పీఠంలో మండప ఆరాధన, అమ్మవారికి అయ్యవారికి అభిషేకాలు. అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. గాయత్రిదేవిగా నూకాలమ్మ, మరిడమ్మ అమ్మవార్లు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శుక్రవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ కార్యనిర్వాహణాధికారులు సౌజన్య, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవార్లను వేద పండితులు. ఆసాదులు గాయత్రిదేవి అవతారంలో అలంకరించారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం

విశాలాంధ్ర - పెద్దాపురం : మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రపంచ శాంతికై రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం ఆధ్వర్యంలో శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన నిర్వహించే ప్రపంచ శాంతికై ఏర్పాటు చేసిన ఉపవాస ప్రార్థనల్లో ప్రముఖ దైవజనులు రెవరెండ్ బదిరెడ్డి అరుణ కుమార్ దైవ ప్రసంగాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘాల విశ్వాసులు ఆలపించిన క్రైస్తవ విప్లవగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దైవజనులు తిమోతి, కె అభిషేక్, విజయ్కుమార్, జయకుమార్, జాన్, దైవ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవి అలంకరణ

విశాలాంధ్ర - సామర్లకోట : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పంచారామ క్షేత్రం సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం బాలా త్రిపుర సుందరి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాల త్రిపుర సుందరి అమ్మవారు రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్నారు. అమ్మవారికి ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించగా పలువురు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని పితాని బేబీరావు అధ్యక్షతన జరిగిన కార్పెంటర్ సమస్యలపై సంఘ సభ్యులుచే ముమ్మిడివరం తహసీల్దార్ ఎంఎస్ లక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. రెడీమేడ్ వేప కర్రతో కిటికీలు, గుమ్మాలు, తలుపులు తయారు చేసే టింబర్ డిపోలలో అమ్మడం వల్ల కార్పెంటర్లు చేతి వృత్తిదారులు పని లేక జీవనోపాధి కోల్పోతున్నారని దీనిపై ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని రెడీమేడ్ అమ్ముతున్న భవన నిర్మాణ గృహపయోకార వస్తువులపై ఆంక్షలు విధించాలని ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు ఆమోదంతోనే కార్పెంటర్ వృత్తిదారులు మాత్రం అమ్ముకునేలాగా ఏర్పాటు చేయాలన్నారు. తెలుగుదేశం, ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి డిపోలలో రెడీమేడ్ వస్తువు తయారు చేయడం అరికట్టాలన్నారు. సమస్యలపై ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేయడమైనది. ఈ సమస్యలపై రాష్ట్ర, జిల్లా, వ్యాప్తంగా ప్రతి మండల రెవెన్యూ ఆఫీసులలో సంఘ సభ్యులకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నేపల్లి భీమశంకరం, యార్లగడ్డ అరుణ్ కుమార్, కుసుమే నర్సింహా రాజు తదితరులు పున్నారు.

మెహర్ ప్రకాష్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - ఆలమూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్‌గా (ఏవో) ఎంవి మెహర్ ప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కపిలేశ్వరపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన రామ్ స్వరూప్ ఆత్రేయపురం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అందుబాటులో ఉంటూ, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు, సిబ్బంది సహాయ సహకారాలతో సేవలు అందిస్తామని తెలిపారు.

జగన్మోహిని కేశవ స్వామికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలోని వెలిసిన పురాతనమైన దేవాలయాల్లో విశిష్ట కలిగిన ఆలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఆలయంలో ఈ ముందు పురుషుని రూపం వెనుక స్త్రీ రూపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. రాజమహేంద్రవరం వాస్తవ్యులు జయంతి వెంకట సూర్యనా రాయణ మూర్తి సురేష్ రాజ్యలక్ష్మి కార్తికేయ వారి కుటుంబ సభ్యులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు రూ. 50,116లు విరాళం అందించారు. కార్యనిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణమూర్తి స్వామి వారి చిత్రపటం, చరిత్ర కలిగిన పుస్తకం, శేష వస్త్రంలతో సత్కరించారు

తెగుళ్ల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో ఆత్రేయపురం మరియు పేరవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. నాదెళ్ల జగదీష్, ముల్లపూడి భాస్కరరావు రైతులు క్షేత్రంలోను అధికారులు సందర్శించటం జరిగింది. వరి పంటలో ఈ సమయంలో వచ్చే బాక్టీరియా ఆకు ఎండు తెగులు, సుడిదోమ జీవచక్రం గురించి మండల వ్యవసాయ అధికారి జె భార్గవ్ మహేష్ రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంటి నాగశ్వరరావు సర్పంచ్ ఏఎంసీ నుంచి ప్రసాద్ రైతులు మరియు కె అన్నపూర్ణ, విహెచ్ఎకే విజయ్ కుమార్, విఏఏ అధికారులు రైతులు పాల్గొన్నారు.

గోపురం నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర -పెరవలి : పెరవలి గ్రామంలో గల శ్రీ షిరిడి దత్తాత్రేయ మందిర్ గోపురం నిర్మాణం కొరకు బేడ బుడగ జంగాల యూత్ రూ.51 వేలు విరాళం ఆలయ కమిటీ అందించినట్లు తెలిపారు. యూత్‌కు ఆలయ కమిటీ వారు ధన్యవాదములు తెలిపారు.

ఎంపీడీవోగా వేణుగోపాల రెడ్డి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్రదేవరపల్లి: దేవరపల్లి ఎంపీడీవోగా వేణుగోపాల రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం దేవరపల్లి ఎంపీపీ కెవికె దుర్గారావును మర్యాదపూర్వకంగా కలిశారు . నూతన ఎంపీడీవో వేణుగోపాల రెడ్డిని మండల పరిషత్ సూపరింటెండెంట్ జి శాంతి దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి నెట్టల కిషోర్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వద్ది వెంకటరమణమ్మకు పిహెచ్.డి ప్రదానం

విశాలాంధ్ర - రాజానగరం : ఆదికవి నన్నయ వర్సిటీ తెలుగు శాఖలో పి.హెచ్.డి పూర్తి చేసిన వద్ది వెంకట రమణమ్మకు పి.హెచ్.డి డాక్టరేటు పట్టా అందుకున్నారు. మండలంలోని నన్నయ్య విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య వై. శ్రీని వాసరావు శుక్రవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కత్తుల కృష్ణభాగవతార్ అముద్రిత హరికథా సాహిత్యం- పరిశీలన' అనే అంశంపై వద్ది వెంకటరమణమ్మ పరిశోధన చేశారన్నారు. పర్యవేక్షకులుగా డాక్టర్ మాగంటి సుధామయి, సహ పర్యవేక్షకులుగా డాక్టర్ తలారి వాసు మార్గదర్శకత్వం వహించినట్లు చెప్పారు. వద్ది వెంకటరమణమ్మను వీసీ ఆచార్య వై శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, తెలుగు శాఖ అధ్యాపకులు అభినందించారు. డాక్టర్.కెవిఎన్డి వరప్రసాద్, డాక్టర్ తలారి వాసు పాల్గొన్నారు.

ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి ఏరియా ఆసుపత్రిలో సరైన చికిత్స అందించక ఇద్దరు గర్భిణీలు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో అత్యవసరంగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి సిడిఆర్‌లో చేరి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించి ఆసుపత్రి తీరుపట్ల ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే నల్లమిల్లి వైద్య అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించి గర్భిణీలు ఎదుర్కొన్న ఇబ్బందులను ఆరా తీసి ఇటువంటివి మరొక్కసారి పునరావృతం కాకుండా చూడాలని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్‌లో చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు ప్రైవేట్ ఆస్పత్రిలో పరామర్శించడానికి వెళ్లినప్పుడు గర్భిణీలు, తల్లిదండ్రులు, బంధువులు తెలపడం జరిగిందన్నారు. వైద్యులు వైద్య సేవలు బాగా అందిస్తున్నారనే భావన ప్రజల్లో కలిగి క్రమంగా రోగుల సంఖ్య పెరుగుతున్న సమయంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం ప్రభుత్వ ఆసుపత్రి యొక్క విశ్వసనీయత దెబ్బతినే అవకాశం ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు. అయితే వైద్యులు, గర్భిణీలు, బంధువులను విచారించినప్పుడు ఇరువురు వివరణలు పూర్తి భిన్నంగా ఉన్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్, పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ పద్మశ్రీ, అశోక్ సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), మల్లీశ్వరి,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక సరఫరా పునరుద్ధరించాలని వినతి

విశాలాంధ్ర - కొవ్వూరు : ఇసుక ర్యాంపులు తెరిచి ఇసుక సరఫరాను పునరుద్ధరించాలని మెమో 1214 రద్దుచేసి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గం లోని భవన నిర్మాణ కార్మికులు స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర బాబు మాట్లాడుతూ ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ప్రత్యామ్నాయ ఉపాధి లేక నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయిని భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇళ్ల నిర్మాణదారులు అనేకమంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇసుక సరఫరాలో కొత్త విధానం తీసుకొస్తానని చెప్పి ప్రభుత్వం ప్రకటించి మూడు నెలలు పూర్తికావస్తున్న ఇసుక ర్యాంపులు పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరగలేదన్నారు. ప్రభుత్వం అనుమతులు ఉన్న ఇసుక ర్యాంపులను తక్షణం ప్రారంభించి ఇసుక అవసరమైన వారికి ప్రభుత్వం నేరుగా సరఫరా చేయాలని ఇసుక సరఫరాలో దళారీ వ్యవస్థ నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మైగాపుల నాగేశ్వరరావు జిల్లా కోశాధికారి మైగాపుల ఆంజనేయులు ఎస్.కే.ఆదామ్ తోట సూర్యారావు మాణిక్ రెడ్డి హరిబాబు మసకపల్లి శ్రీను జొన్నల రాంబాబు వల్లెపు రాంబాబు వీరాంజనేయులు, సిద్ధం శెట్టి సత్యనారాయణ తాతారావు తంగేళ్ల కొండయ్య పాల్గొన్నారు.

నేడు,రేపు బస్ పాస్ కేంద్రం మూసివేత

ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ షాబాన

విశాలాంధ్ర - రాజానగరం : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు కోసం ప్రతి నెల అందించే బస్ బస్సుపాసుల సాఫ్ట్‌వేర్ నవీనీకరణలో భాగంగా ఈ నెల 5, 6 తేదీల్లో మూసివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షాబాన అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తమ డిపోలో ప్రతినెల ఇస్తున్న బస్ పాస్ కేంద్రం సాఫ్వేర్ నవీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 5,6 రెండు రోజుల పాటు బస్ పాస్ కౌంటర్ మూసివేస్తున్నమని, తిరిగి 7వ తేదీ నుండి యధావిధిగా బస్ పాస్ సేవలు కొనసాగు తాయని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం డిపో పరిధిలో ప్రయాణించే విద్యార్థులు, సీజన్ టిక్కెట్లు తీసుకొనే వారు, మంత్ల సీజన్ టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులు,ప్రత్యేక ప్రతిభావంతులతో పాటు ప్రతిఒక్కరు తమకు సహకరించాలని కోరారు. బస్ పాస్ నిమిత్తం కేంద్రాన్ని కి ఈ నెల 5,6 తేదీల్లో ఎవరు రావద్దని, ప్రతిఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మాలలు అధైర్య పడవద్దు : అశోక్‌కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : సుప్రీమ్ కోర్టులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దాఖలు అయిన రివ్యూ పిటీషన్‌లను సుప్రీమ్ కోర్టు కొట్టివేయడం జరిగింది. శుక్రవారం అమలాపురం ఈదరపల్లి మాల మహానాడు ఆఫీస్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో జిల్లా మాలమహానాడు అధ్యక్షులు పండు అశోక కుమార్, జల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాలలు ఈ విషయంలో అధైర్య పడవలసిన అవసరం లేదు అని దీని పై అందరూ ఇకనైనా ఏకమై మరో పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. అలాగే పెయ్యల పరశురాముడు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న వెసులుబాటును బట్టి న్యాయపోరాటంలో మరొక్క సారి న్యాయ నిపుణులతో చర్చించి ముందుకు వెళ్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, గుటం సాయి, కొంకి వెంకట బాబ్జి, కుంచె బాబులు, మెండి డేవిడ్, పొలమూరి మణి, సాపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని వెలికితీసేందుకు క్రీడలు దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన క్రీడాస్ఫూర్తిని విలికితీసేందుకు ఇటువంటి క్రీడాలు దోహదపడతాయని వాలి బాల్ నేషనల్ రిఫరీ ఆర్.సురేష్ అన్నారు. మండలంలోని దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నేషనల్ రిఫరీ ఆర్.సురేష్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న సిబిఎస్ఈ క్లస్టర్ రాష్ట్ర స్థాయి వాలీ బాల్ క్రీడా పోటీలు శుక్రవారం రెండో రోజుకి చేరారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సిబిఎస్ఈకి చెందిన 50 జట్లు పోటీలో తలపడ్డారు. దీనిలో భాగంగా రెండో రోజు సైతం క్రీడాకారులు అదే జోరును కొనసాగించారు. ఒకానొక సమయంలో ప్రత్యర్థులను గందరగోళానికి గురి చేస్తూ నువ్వానేనా అన్నరీతిలో తమతమ స్మైశింగ్ షార్టులతో వారి వారి జట్ల గెలుపుకోసం తీవ్రంగా శ్రమించారు. నేషనల్ రిఫరీ ఆర్.సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులు ఎంతో క్రీడాస్ఫూర్తితో తమ ప్రతిభను చాటుతున్నారని చెప్పారు. క్రీడలను తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులను అబ్బుర పరుస్తూ వారి వారి జట్ల గెలుపుకు కృషి చేస్తున్నారని చెప్పారు.రెండవ రోజు పోటీల్లో అండర్ 14,17,19 విభాగాల్లో గెలిచిన జట్ల వివరాలు వెల్లడించారు.వీరంతా ఆదివారం జరగనున్న ఫైనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆన్‌లైన్ ప్రోగ్రాం విజయవంతం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ (సెంటర్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్), ఏఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించినటువంటి 'డేటా విజువలైజేషన్ విత్ పవర్ బిఐ అండ్ టేబ్లు' అనే ఆన్లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. ఈ ప్రోగ్రాంలో డేటా విజువలైజేషన్ మరియు అత్యాధునిక పవర్ బిఐ టూల్స్ వాడకాన్ని మరియు నూతన అంశాలతో కూడిన పాఠ్యాంశాలను ఎంతో అనుభవం ఉన్నటువంటి, రిసోర్స్ పర్సన్ అయిన డాక్టర్ ఎం వెంకటేష్ బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇండస్ట్రీ ఎక్స్పర్ట్స్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జీ సురేష్, కోఆర్డినేటర్ డా ఐ వీరాంజనేయులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సూర్య ఆయుర్వేదిక్ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం గండేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి సూర్య ఆయుర్వేదిక్ కేంద్రాన్ని శుక్రవారం జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన ప్రకృతిలో దొరికే వనమూలికలతో తయారు చేసినటువంటి ఈ ఉత్పత్తులను వాడటం ఆరోగ్యకరమని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, పితాని వీరబాబు, పోతుల మోహన్ రావ్, బచ్చల రాజు, పాలెం బాబి, జట్ల రాజేష్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు అందుబాటులో కార్యాలయం

విశాలాంధ్ర - సీతానగరం: ఇకపై కార్మిక కర్షకులకు అందుబాటులోనే మా కార్యాలయం ఉంటుంది అని ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు బదుగు జయరాం అన్నారు. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో ఐ ఎఫ్ టి యు డివిజనల్ కార్యాలయంను జిల్లా నాయకులు హరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు జయరాం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గల కార్మిక కర్షకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పై పోరాటం చేసేందుకు మరింత చెరువులో ఉండేందుకు ఈ కార్యాలయం ప్రారంభించడం జరిగింది అని అన్నారు. ఇక పై కార్మికులకు ఏ సమస్య ఉన్న నేరుగా కార్యాలయంకు సమస్యను తెలియజేస్తే ఆ సమస్యల పై అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లే పరిష్కారం దిశగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తెలగా శ్రీనివాస బాబు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె అధికారుల ఆమోద ముద్ర

విశాలాంధ్ర - కాకినాడ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఏ రాజ్‌కుమార్ సిద్ధాంత వ్యాసం "డిజైన్, డెవలప్‌మెంట్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సాలిడ్ లిపిడ్ నానోపార్టికల్స్ యాజ్ నోవల్ టాపికల్ డ్రగ్ డెలివరీ కెరియర్స్ ఫర్ డెర్మటాలాజికల్ అప్లికేషన్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఫార్మసీ విభాగంలో లభించినది. ఏ రాజ్‌కుమార్ తన సిద్ధాంత వ్యాసాన్ని విశాఖపట్నం లోని ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ డా పి రాజేశ్వరరావు మరియు హైదరాబాద్‌లోని డా రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆర్&డి డైరెక్టర్ సిపిఎస్-ఫార్ములేషన్స్ డా ఎం గణేశన్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

కోపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో కూటమికి ఓటు వేయాలి

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమికి ఓటు వేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కాకినాడ టౌన్ రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ మరియు పిఠాపురం టిడిపి మాజీ ఎమ్మెల్యే వర్మ, పిఠాపురం జనసేన ఇన్చార్జ్ శ్రీనివాస్ సమక్షంలో టిడిపికి చెందిన ఇద్దరు డైరెక్టర్లు వీళ్ళ వీర వేంకట నాగేశ్వరరావు, అద్దంకి వేంకట రమణ, జనసేన తరఫున ముగ్గురు చెల్లిబోయిన ప్రమీల, అరిగేల ప్రసాదరావు, మేళం రామకృష్ణ పోటీలో ఉండగా అయిదుగురు డైరెక్టర్లకు కూటమి తరఫున ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఇక చైర్మన్‌గా జనసేన తరఫున, వైస్ చైర్మన్‌గా టిడిపి తరఫున బాధ్యతలు స్వీకరిస్తారని ఈ సందర్భంగా వారు పత్రికా ప్రకృతి ద్వారా తెలిపారు.

లతేంద్ర వర్మకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండలం రాజోలు గ్రామంకు చెందిన, సామాజిక సేవకుడు, శ్రీముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ముదునూరి లతేంద్ర వర్మకు ఇంటర్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ గౌరవ డాక్టరేట్ అవార్డు మండలి ద్వారా గత నెల 28న ఢిల్లీలో గౌరవ డాక్టరేట్‌ను పొందారు. డాక్టరేట్ అవార్డుకు సంబంధించిన సర్టిఫికెట్ అండ్ మెమోరాండంను ముదునూరి అక్కిరాజు ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు లతేంద్ర వర్మకు అందించారు. ఈ సంద ర్భంగా శుక్రవారం రాజోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవార్డ్ గ్రహీత డాక్టర్ ముదునూరి లతేంద్ర వర్మ మాట్లాడుతూ గత ఆరు సంవత్స రాలుగా తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి తనకు గౌరవ డాక్టరేట్ అవార్డును అందించిన ఇంటర్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ ధన్యవాదములు తెలిపారు.

స్వర్ణాంధ్ర-2047కు సూచనలు ఇవ్వండి

గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఆంధ్రప్రదేశ్‌ను పేదరిక రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ రాష్ట్రంగా రూపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొం దిస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యు మెంట్‌కు ప్రతీ ఒక్కరూ మంచి సూచనలు అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించడంపై గురువారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో అధికారులతో సమీక్షించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ విజన్‌కు ముఖ్యమంత్రి అన్ని రంగాలలో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థాయిలో నిలిపేందుకు అవసరమైన విజన్ డాక్యుమెంట్ రూపొందించడంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆలోచనలను పరిగణనలోనికి తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్రగా రూపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి అన్ని వర్గాల ప్రజలు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించి అత్యంత ఉత్తమమైన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సహకరించాలన్నారు. ఏలూరు జిల్లా విజన్ డాక్యుమెంట్ చక్కగా రూపొందించారని, అదేస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి పార్థసారథి చెప్పారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), డా. కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా, జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామాలలో గ్రామసభలు నిర్వహించండి : జేసీ

విశాలాంధ్ర భీమవరం: రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి రీ సర్వే, ధాన్యం కొనుగోళ్లు, రేషన్ షాపులపై రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేలు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే జరిగిన 174 గ్రామాల్లో గ్రామ సభలు అక్టోబరు 15 నుండి 30వ వరకు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామసభల్లో భూ యజమానులకు సంబంధించిన అభ్యంతరాలు ఉంటే తీసుకుని వాటిని పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో ఇంకా 119 గ్రామాలు లో రీ సర్వే పెండింగ్ ఉన్నాయని అన్నారు. రీ సర్వే చేయవలసిన గ్రామాలల్లో రీ సర్వే చేయడానికి తగిన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని తహసీల్దారులకు సూచనలు జారీ చేశారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్.పి.ఎంలను డ్రైవ్ మోడ్ లో పెట్టాలి అని తెలిపారు. దీనిలో ఎటువంటి అవకతవకలు జరిగిన అలక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరిం చారు. 2002-25కు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలోని 20 మండలాల్లో ట్రైనింగ్ ప్రోగ్రాములను కస్టోడియన్‌లు, వి ఏ ఓలు, టి ఎలు,డి.ఇ.ఓ లు,హెల్పర్లకు, రైస్ మిల్లర్స్ కు ఈనెల 5 నుంచి రెండవ విడత ఉదయం మధ్యాహ్నం, తొమ్మిదో తేదీన మూడవ విడత శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆయా మండలాల తాహసిల్దార్లకు తెలిపారు. ప్రతి మిల్లర్ వద్ద నుండి 50 శాతం గన్ని బ్యాగులను ముందుగా తీసుకొని రైతు సహాయ కేంద్రాల్లో భద్రపరచా లని చెప్పారు.ప్రతి మండలంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు టీం ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ షాపులు గ్రామాల్లో 400 నుండి 450, అర్బన్ లో 500 నుండి 550 కార్డులు ఉండేలా చూడాలన్నారు. రూరల్ మండలాల్లో 800 నుండి 1000 పైబడి ఉన్న షాపులు, అర్బన్ లో వెయ్యి నుండి 1500 ఉన్న షాపులు రెండుగా విభజించి ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా షాపులు ఏర్పాటు చేయుటకు ఈనెల 12 నాటికి జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలను పంపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సంబంధించిన అధికారును ఆదేశించారు.

ఈ వీడియోకాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర రావు,జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ ఎం.శివశంకర్, జిల్లాలో అన్ని మండలాల తాహసిల్దారులు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : అంతర్ జిల్లాల్లో వరుస గొలుసు చోరీలకు పాల్పడుతున్న ఇరువురు కవల దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.5 లక్షలు విలువ చేసే 60 గ్రాముల బంగారు ఆభరణాలు (చైన్) స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఏలూరు లోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. జిల్లాలోని పైడిచింతపాడు గ్రామానికి చెందిన పాత నేరస్తులైన సైదు రాఘవేంద్ర ప్రసాద్, సైదు రవీంద్ర ప్రసాద్ ఇరువురు కవల సోదరులు. అయితే వీరు గత కొంతకాలంగా ఈజీ మనీకి అలవాటు పడి ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు ఆభరణాలు, చైన్లు అపహరించి పరారవుతున్నారు. ఈ విధంగా వీరిరువురిపై ఇతర జిల్లాలతో పాటు, జిల్లాలోని ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్, కైకలూరు పోలీస్ స్టేషన్లో పరిధిలో పలువురు మహిళల మేడలో బంగారు గొలుసులు అపహరించడంతో ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఈ మేరకు ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో వన్టౌన్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా భాష కేసు నమోదు చేసి నిందితుల కోసం దర్యాప్తు ఆరంభించారు. ఇందులో భాగంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాఘవేంద్ర, రవీంద్రలను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగ గొలుసు దొంగతనాలకు పాల్పడుతుంది వారేనని అంగీకరించారు. దీంతో ఈ కవల సోదరులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 60 గ్రాముల బంగారు గొలుసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. వరుస గొలుసు దొంగతనాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసినందుకుగాను వన్ టౌన్ సిఐ సత్యనారాయణ, వన్ టౌన్ ఎసై మదీనా భాష, సిబ్బందిని ఎస్పీ కిషోర్ అభినందించారు.

నూజివీడు డిఎస్పీగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు డిఎస్పీగా కెవివిఎన్ వి. ప్రసాద్ బాధ్యత స్వీకరించారు. డీఎస్పీ ప్రసాద్ విజయవాడ నుంచి నూజివీడుకు బదిలీపై వచ్చారు. శు క్రవారం డిఎస్పి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను నూజివీడు సబ్ డివిజన్లోని పోలీస్ అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

విజయ కనక దుర్గ ఆలయం వద్ద ప్రతిష్ఠ కలశ స్థాపన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో కొత్తూరు జాతీయ రహదారి హైవే బ్రిడ్జి పక్కన నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ వద్ద శు క్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, ప్రతిష్ఠ కలశ స్థాపన, సంకల్పము, మంటపారాధన, జల దివానము, క్షీరాదివానము, మధ్యాహ్నం అగ్ని మదనము, అగ్ని ప్రతిష్ఠ, హోమములు, దుర్గా సప్తశత హెూమము, మూలమంత్ర హోమం, ధాన్యాదివానము, పుష్ప దివానము, సయ్యా నీరాజన మంత్ర పుష్పములు, చతుర్వేద స్వస్తి వంటి కార్యక్రమములు గ్రామ పురోహితులు చింతా అరుణ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న దంపతులు పీటల మీద కూర్చుని ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు

విశాలాంధ్ర - సీతానగరం: ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైరహాజరు. మండలంలో గల పురుషోత్తపట్నం గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి సరోజా రాణిపై అధికారు లకు ఏ విధమైన సమాచారం లేకుండా అక్టోబర్ ఒకటవ తేదీ నుండి నేటి వరకు విధులకు హాజరు కాలేదని అధికారులు అంటున్నారు. దీనివల్ల గ్రామంలో నిర్వహించవలసిన గ్రామసభ సైతం నిర్వహించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలో ఏ విధమైన అనుమతులు లేకుండా బొమ్మ పెట్టడానికి కొంతమంది ప్రయత్నం చేయడంతో అధికారులు దానిని అడ్డుకొని తప్పనిసరిగా అనుమతులు ఉండాలంటే నిలిపివేశారు. గ్రామంలో అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి గ్రామపంచాయతీలో విధులకు ఏ విధమైన ఆటంకం లేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.